శుక్రవారం

గుమ్మందాటి సైకిలు స్టాండువేసి, మాసిన పైపంచతో ముఖం తుడుచుకుంటూ లోపలికి వచ్చాడు రామేశం.

ముందు గదిలో నిలబడి ఉన్న భార్యను చూసి "స్కూలు బస్సు వచ్చిందా?" అని అడిగాడు.

సీతమ్మ "ఆఁ! పావుగంట సేపు నిలబడ్డాను. వెంకటిని బస్సెక్కించే వచ్చాను. అది సరే! మీరెక్కడికి వేంచేశారు, తలుపులు బార్లా తీసిపెట్టి?" అని అడిగింది కటువుగానే.

రామేశం నవ్వి "పోదూ, మరీనూ! తలుపులు బార్లా తీసిపెట్టి పోయానా? దగ్గరికి లాగి గొళ్ళెం పెట్టి మరీ వెళ్ళాను కదా?" అంటూ పంచెను లుంగీగా కట్టుకుని చాపమీద కూలబడ్డాడు.

"అయితే మాత్రం? రోజులెలా ఉన్నాయి? మనకు తెలియకుండా మన తలకాయనే తీసుకుపోయి పక్కవీథిలో అమ్మేయగలిగిన మాయావులున్నారు. ఇంకా నయం... నేను వెంటనే రాబట్టి సరిపోయింది. ఎవడైనా కొంపలో దూరి ఉన్న గిన్నే, బొచ్చే చంకన పెట్టుకుపోతే ఏం చెయ్యగలం? ఒక స్పూన్ కొనాలంటేనే గుడ్లు వెళ్ళకొస్తున్నాయి..."

సీతమ్మ సణుగుడు ఇంకా కొనసాగేదే. అయితే, రామేశం అనునయంగా సమాధానం చెప్పాడు. "నువ్వలా వెళ్ళిన కాస్సేపటికి చూద్దునుకదా! సైకిలు ముందుచక్రంలో గాలి బొత్తిగాలేదు తీసుకువెళ్ళి సుభానీకి చూపిస్తే పంచరయిందని, బాగుచేసి రెండు రూపాయలు వసూలు చేశాడు. సైకిల్ మూలపడితే ఇవాళ బొత్తిగా గడవదు కదా! అందుకని వెళ్ళాను!"

సీతమ్మ "అన్నట్టు ఈ పూట ఏవిఁటి కార్యక్రమం? అదే! వంట సంగతి..." అన్నది జుట్టు తీసుకుంటూ తానుకూడా గుమ్మంలో కూర్చుని.

ఉదయం తొమ్మిదిన్నర గంటలు వేళ...సూర్యుడు ఉండి ఉండి మబ్బుల్లోకి వెళ్ళిపోతున్నాడు. ఆకాశంలో గచ్చకాయ రంగులో ఉన్న మేఘాలు నెమ్మది నెమ్మదిగా గుమిగూడుతున్నాయి. ఉక్క పోస్తున్నది. బహుశా వర్షం వస్తుందేమో! అలా అయితే ప్రాణాంతకమే...చాలా తిరుగుడు ఉంది ఈ పూట. ఎక్కడో వన్‌టౌన్‌లో మారుమూల ఏడ్చింది ఆ కొంప. పైగా శుక్రవారం సాయంకాలం బోలెడు పూజలున్నాయి...వర్షం పగలల్లా ఆగి రాత్రి మనం ఇంటికి చేరుకున్న తరువాత కురిస్తే బాగుణ్ణు అనుకున్నాడు రామేశం.

"ఆఁ!ఆఁ! విన్నాను. ఇవాళ రామ్మూర్తిగారితో పోవాలి. ఎక్కడో వన్‌టౌన్‌లో ఎవరో చచ్చినవాళ్ళది అబ్దికం...నిన్న సోడాబుడ్డి కళ్ళద్దాల వాడొకడు వచ్చి గీకి గీకి బేరమాడి కుదుర్చుకు పోయాడు. రామ్మూర్తిగారికి ఈ మధ్య కక్కుర్తి ఎక్కువైపోతున్నది. మంత్రం చెప్పినందుకు తనకు ఇరవై రూపాయలు, భోక్తకు పదిహేను అడగాలి. అవతలి వాడు నస పెట్టి బేరమాడితే తనకు పదిహేను, నాకు పదికీ ఒప్పేసుకున్నాడు. నేనేమీ మాట్లాడలేక ఊరుకుండిపోయాను."

"సరే అయితే...నే నొక్కదాన్నే అన్నమాట. చిన్నవాడికి క్యారియర్ కోసం ఉడకేసిన అన్నం ఉంది. ఏ పచ్చడో వేసుకుని గడిపేస్తాను." అన్నది సీతమ్మ జడ అల్లుకుంటూ.

"చిన్న వెధవకు చదువు బాగా వంటబడుతున్నాదా? లేకపోతే నా పోలికా?" అన్నాడు రామేశం నవ్వుతూ.

సీతమ్మ కొంచెం కోపంగా "మీ పోలికేమీ కాదు. తాతల పోలిక కూడా కాదు. మేనమామ పోలిక...మా అన్నయ్య ఎట్లా చదువుకున్నాడు? మా నాన్న వాణ్ణి ఎస్సెల్సీతోనే ఆపేసి పౌరోహిత్యంలోకి దింపేసేవాడు...కాని, వాడు పట్టుదలగా చదివి ఎమ్.ఎ. పాసయ్యాడు. పెద్ద ఆఫీసరయినాడు." అన్నది.

రామేశం ఎగతాళిగా "అవును...పెద్ద ఆఫీసరై తండ్రినీ, చెల్లెల్ని ఉద్ధరించాడు, చూస్తున్నాంగా!" అన్నాడు.

తమ పెళ్ళయిన తరువాత సంవత్సరానికే సీతమ్మ తండ్రి పోయాడు. తమ పెళ్ళికి, తండ్రి కర్మాంతరాలకు రావడమే తప్ప మళ్ళీ అతగాడు ఈ దిక్కుకే రాలేదు. ఎక్కడో భిలాయ్‌లో పెద్ద ఉద్యోగంలో ఉండిపోయాడు. అప్పుడప్పుడు ఉత్తరాలు మాత్రం రాస్తూ ఉంటాడు చెల్లెలిమీద ప్రేమ కురిపిస్తూ. అదీ రామేశం కడుపుమంట.

సీతమ్మ నిట్టూర్చి "ఈ రోజుల్లో అంతే...ప్రేమలూ, అనుబంధాలూ ఏవీ లేవు. పైగా దూరాభారం...వాణ్ణి అనుకుని మాత్రం ఏంలాభం?" అని ఊరుకున్నది.

చిన్న ఖాళీ స్థలంలో ఒకవైపు కనకాంబరం మొక్క....ఎదురుగా గోడ. గోడమీదనుంచి అవతలివైపు రాతి ఉసిరి కొమ్మలు ఇటువాలి ఉండి, గాలికి కదులుతున్నాయి. దంపతులు కూర్చుని ఉన్న ముందు గది చిన్నది. వెనుక చిన్న వంట ఇల్లు. ఇల్లుగలవారి బాధలేదు. వాళ్ళెక్కడో రాజధానీ నగరంలో ఉంటారు. నెలకోసారి క్రమం తప్పకుండా అద్దె - అదీ తక్కువే. కేవలం వంద రూపాయలు - పంపితేచాలు.

రామేశం లేస్తూ ఉంటే సీతమ్మ అతడు బయదేరుతున్నాడనుకుని తానూ కదలింది. అతనిప్పుడు వెడితే మళ్ళీరావడం మధ్యాహ్నం రెండు గంటల తరువాతనే. తాను ఈ లోపల దగ్గరలో ఉన్న సినిమా హాలుకు వెళ్ళి పదకొండు గంటల ఆట - మహిళా ప్రపంచాన్ని ఉర్రూత లూగిస్తూ, కలెక్షన్లలో ఆల్ టైమ్ రికార్డులు సృష్టిస్తున్న సంచలన పంచరంగుల సినిమా - చూసి రావచ్చు. దానికోసం ఇటీవల రకరకాల చిన్న చిన్న ఖర్చులలో జాగ్రత్తపడి ఏడు రూపాయలు దాచిందికూడా.

"స్నానం చేస్తాను" అన్నాడు రామేశం.

సీతమ్మ మెల్లిగా "నీరు పెట్టలేదు. కుంపటి ఆరిపోయి ఉంటుంది. చన్నీళ్ళు పోసుకోండి" అన్నది.

రామేశం నవ్వి "తప్పుతుందా?" అంటూ పెరటిలోకి వెళ్ళాడు. అక్కడ రాళ్ళగుంట ఉంది. బొక్కెనలో నీళ్ళు తళతళలాడుతున్నాయి. తలఎత్తి చూస్తే...ఆకాశంలో చిక్కగా గుమికూడుతున్న మబ్బులు కనిపించాయి.

'మొదటి చెంబుతోనే చలి....తరువాత చలీలేదు గిలీలేదు' అనుకుని చెంబుతో నీళ్ళు ముంచి 'జై పరమేశ్వరా' అనుకుని నెత్తిమీద బోర్లించుకున్నాడు.

స్నానం త్వరత్వరగా పూర్తిచేసి ముందు గదిలోకి వచ్చి ఉతికిన పంచె కట్టుకుని తయారై "ఇదిగో నిన్నే...నేను వెళ్తున్నాను. తలుపు వేసుకో" అన్నాడు సైకిలు తీస్తూ.

సీతమ్మ భర్త వంకనే చూస్తూ తల ఊపింది. అతడు వెళ్ళిపోగానే వీధితలుపువేసి ముందు గదిలోకివచ్చి ఒళ్ళు విరుచుకుని 'చిరాగ్గా ఉంది స్నానం చెయ్యాలి' అనుకున్నది.

తరువాత పెరట్లో స్నానం చేస్తూ తాను చూడబోయే సినిమాను గురించే ఆలోచించింది. సినిమాల్లో నాయికా నాయకులు సాధారణంగా మొదటి చూపులోనే ప్రేమించుకుంటారు. కొన్నింటిలో అయితే ముందు ఒకరికి మరొకరి మీద అసహ్యం....పగ....ఆ తరువాత అది గాఢమైన ప్రేమగా మారుతుంది. వెంటనే ఎక్కడెక్కడో కొండల్లో, లోయల్లో కిందామీదాపడి దొర్లుకుంటూ ఎగురుకుంటూ యుగళగీతాలు పాడుకుంటారు. మాటకో డ్రస్సు మారుస్తారు. వాళ్ళ ఇళ్ళన్నీ రాజమందిరాల్లా గుంటాయి. పెద్ద పెద్ద హాళ్ళూ.... పెద్ద పెద్ద సోఫాసెట్లూ....ఖరీదైన తివాచీలూ...పొడవాటి తళతళలాడే డైనింగ్ టేబుల్సూ....వాటిమీద ఎప్పుడు ఎవరూ తినని యాపిల్ పళ్ళతో నిండిన గాజు పాత్రలూ....గిర గిర తిరిగే బెడ్‌రూమ్స్ - అంతా కన్నుల పండుగగా ఉంటుంది.

'అలా ఎవరైనా ఉంటారా ఈ ప్రపంచంలో?' అనుకున్నది సీతమ్మ. 'ఏమో! ఎవరు చూడొచ్చారు? కొంద రంత అట్టహాసంగా, ఆడంబరంగా ఉంటారేమో!' అనుకుందీ మళ్ళీ.

తాను పల్లెటూరి పురోహితుడి ఇంట్లో పుట్టింది. పెద్దగా చదువు సంధ్యల్లేవు. ఎప్పుడూ ఇంటినిండా బియ్యమూ....కొబ్బరి చిప్పలూ ఖర్జూరపుకాయలూ....అరిటి పళ్ళూ ఇదీ వాతావరణం. తండ్రి బయట ఏమీ పనిలేనప్పుడు అరుగుమీద కూర్చుని జంధ్యాలు వడుకుతూ ఉండేవాడు. ఎవరో పిల్లలు ఒకరూ అరా కూర్చుని ఏవో వల్లెవేస్తూ ఉండేవారు. పాత కాలపు పొలం కొంచెం ఉండేదికాని, ఎవడో కౌలుకు చేస్తూ సంవత్సరాని కొకసారి తిప్పుకుని తిప్పుకుని ఎంగిలి మెతుకులు విదిలించినట్టు కాసిని రూపాయలు విదిలించేవాడు.

ఇదుగో. ఆ తరువాత ఈ సంబంధం...రామ్మూర్తిగారు వచ్చి చెవినిల్లు కట్టుకుని నసపెట్టాడు. "పిల్లవాడు లక్షణంగా అందంగా ఉంటాడు...ఒక్కగా నొక్కడు. తల్లీ, తండ్రీ తోబుట్టువులూ ఏ పేచీ లేదు. మంచి మనస్సునవాడు నెమ్మదస్తుడు. అన్నిటికీ మించి కానీ కట్నం ఇవ్వనక్కరలేదు. పెళ్ళిచేస్తే చాలు....వచ్చేవారూ, పోయేవారూ ఎవరూలేరు. చాలదూ? ఇంతకన్నా మంచి సంబంధం తేగలమా?" అంటూ పోరాడి సాధించాడు. సీతమ్మ తండ్రి తనకున్నంతలో ఆ పల్లెటూళ్ళో అట్టహాసంగానే వివాహం జరిపించాడు.

సీతమ్మ మొగుణ్ణి చూసి ఎంతో సంబరపడిపోయింది అందరూ 'పెళ్ళి కూతురు అదృష్టవంతురాలు' అన్నారు. 'నిజానికి నేనే ఆయనకు తగను' అనుకున్నది సీతమ్మ. పట్నంలో కాపురం పెట్టిన మొదట్లో, అతనికి క్రాపు లేదనీ, ప్యాంటూ, చొక్కాలు వేసుకోకుండా పౌరోహిత్యం చేస్తూంటాడనీ కించిత్తు బాధపడిన మాట వాస్తవమే కాని, తరువాత తరువాత, 'ఇలాటి భర్త ఎంత మందికి లభిస్తాడు? మనిషి బంగారం కదూ! మనసు వెన్నకదూ!' అనుకున్నది ఆమె.

స్నానం ముగించుకుని ముందు గదిలోకి వచ్చి గూట్లో ఉన్న అద్దం ముందు నిలబడి తలకట్టు సరిచేసుకుంటూ 'అయినా రోజులు గడ్డుగా ఉన్నాయి. ఆయన ఎంత కష్టపడినా గడవడం కష్టంగానే ఉంది. ఎంతో జాగ్రత్తగా ఉండవలసి వస్తున్నది. అనేక ఖర్చులు మానుకోవలసి వస్తున్నది' అనుకున్నది.

అయినా, ఆరేళ్ళ కుర్రకుంక విషయంలో మాత్రం ఏ లోపమూ జరగడానికి వీల్లేదు. వాణ్ణి ఇంగ్లీషు మీడియంలో మంచి ప్రైవేటు స్కూల్లో చేర్పించారు. వాడు 'మమ్మీ, డాడీ' అంటూంటే, ఇంగ్లీషు పద్యాలూ చదువుతూ ఉంటే ఎంత ముచ్చటగా ఉంటుంది! మొదట్లో, రామేశం 'వెధవా! నన్ను 'నాన్న' అని పిలు. ఏమిటో తిట్టినట్టు 'డాడీ' ఏమిటి నీ బొంద?' అనేవాడు. కాని, తరువాత అతడు కూడా కొడుకుని చూసి ముచ్చటపడటం ప్రారంభించాడు.

వాడి స్కూలు ఫీజు నెలకు అరవై రూపాయలు. బస్సుకు ఇరవై రూపాయలు. ఏడాది మొదట్లో వందలు జీతమూ... పైగా స్కూలు డ్రస్సు...టైలు...బూట్లు...వగైరాలు...ఇవి ఏ పరిస్థితిలోనూ ఏమారడానికి వీల్లేని ఖర్చులు...చచ్చినట్టు కట్టి తీరవలసిందే....

సీతమ్మ చెక్క బీరువాలో నుంచి శుభ్రమైన చీర ఒకటి ఇవతలికి తీసి కట్టుకోబోతూ హఠాత్తుగా ఆగిపోయింది. కొద్ది క్షణాలూ అలాగే మౌనంగా నిలబడిపోయింది. అంతలో ఏమనుకున్నదో ఏమో! ఆ చీరను మళ్ళీ బీరువాలో విసిరేసి మరో మామూలు కట్టుడు చీర తీసుకుని కట్టుకుని, గోడ పక్కకు వెళ్ళి పక్కింటి కామాక్షమ్మగారిని పిలిచి 'ఒక్క సారి వార పత్రిక ఇస్తారూ? సీరియల్స్ చదివి ఇచ్చేస్తాను' అన్నది.

ఆ తరువాత పత్రిక అందుకొని వచ్చి చాపమీద కూలబడి 'అయిదారు రూపాయల పిచ్చి ఖర్చు తప్పింది. లక్షణంగా సీరియల్స్ చదివితే సరిపోయే..కాలక్షేపం....' అనుకుంటూ దయ్యాల సీరియల్ చదవడం ప్రారంభించింది.

◆ ◆ ◆ ◆ ◆ ◆

రామేశానికి విసుగ్గా ఉంది. చిరాగ్గా ఉంది. అసలే చిన్న పెంకుటిల్లు... పైగా బయట వర్షం...పక్క ఖాళీ స్థలమంతా బురదగా ఉంది. పైన పెంకులు సరిగా లేవేమో, లోపల అక్కడక్కడ చినుకులు పడుతున్నాయి.

ఆ ఇంటి యజమాని లావుపాటి కళ్ళజోడు పెట్టుకొని నిశ్శబ్దంగా చెప్పిన పనులు చెప్పినట్టు చేస్తున్నాడు. ఒక ముసలావిడ తడిగుడ్డతో వంట ఇంట్లో కట్టెల పొయ్యితో సతమతమవుతున్నది. ఒక మోస్తరు అందమైన యువతి - ఆ గృహ యజమాని రెండో భార్య - అటూ ఇటూ తిరుగుతూ, అవీ ఇవీ అందిస్తున్నది.

ముసలావిడ మధ్య మధ్య విసుక్కుంటూ "మహాతల్లి ఎక్కడి ఋణమో... తీర్చుకుపోయింది.... మేం చస్తున్నాం... ప్రతిఏటా ఉన్నవి గాక ఇదొక తద్దినం... తప్పదు...." అని పెద్దగానే సణుగుతున్నది.

కార్యక్రమం మూడు వంతులు పూర్తిఅయి భోజనాలకు కూర్చునేసరికి రెండు గంటలు కావస్తున్నది. రామ్మూర్తిగారు మహా చాదస్తం మనిషి. 'అవతలి వ్యక్తులను బట్టి మన పద్ధతులు మార్చుకుంటూ ఉండాలి' అని చెబితే వినడు. శ్రద్ధగా, సాంగోపాంగంగా, అన్నీ సవ్యంగా జరిపిస్తే తప్ప తృప్తి ఉండదాయనకు. 'అలా చేయడం వంచన... దైవద్రోహం' అంటూ ఉంటాడు కూడా.

కిలో రెండు రూపాయల బాపతు బియ్యం కాబోలు అన్నం అధ్వానంగా ఉంది. మూడు కూరలున్నాయని పేరేకానీ అందులో ఒకటి కాకరకాయ. తనకు అదంటేనే అసహ్యం. మిగిలిన రెండు కూరలూ రుచీపచీ లేకుండా నీళ్ళుకారుతున్నాయి. "నెమ్మదిగా కూర్చోండి...ఆలశ్యమైంది" అంటూ శాస్త్ర ప్రకారం రెండుసార్లు చెప్పాడు గృహ యజమాని.

రామ్మూర్తి బట్టతలమీదనుంచి పడిన వాన చినుకులను చేత్తో తుడుచుకుంటూ కబుర్లు ప్రారంభించాడు. ఆ కుటుంబ వివరాలతో ప్రారంభించి, అంతర్జాతీయ రాజకీయాల వరకూ అనర్గళంగా సాగింది ఆయన వాగ్ధోరణి...

అంతా అయి తాము తాంబూలాలు అందుకుని బయలుదేరేసరికి మూడు గంటలవుతున్నది. వర్షం కాస్త తెరిపి ఇచ్చింది. రొఖ్ఖం రొండిన దోపుకుంటూ "వెళ్ళొస్తాం...మీ భోజనాలు కానివ్వండి....పొద్దు పోయింది" అంటూ రామ్మూర్తి, ఆ వెనుకనే రామేశం సైకిళ్ళు తీసుకుని ఇవతలికి వచ్చారు.

రామేశం చప్పరించి "బస్సు ఛార్జీలు అడగవలసింది మీరు" అన్నాడు.

రామ్మూర్తి అదొక రకంగా నవ్వుతూ "సైకిళ్ళమీద వచ్చి బస్సు ఛార్జీలు ఇమ్మంటే తెలివి తక్కువగా ఉంటుంది. కాస్త మనుషులను బట్టి వెళ్తూ ఉండాలి. అయినా, ఈ మధ్య నువ్విలా 'డబ్బు డబ్బు' అంటూ కలవరిస్తున్నావేమిటి?" అన్నాడు.

రామేశం నిట్టూర్చి "మీకేమండి బాబూ! అలాగే మాట్లాడతారు! ఇల్లుంది. సంపాయించే కొడుకున్నాడు. నా సంగతి అలా కాదుగా? ఎంతో జాగ్రత్తగా ఉండాలి. వెనకా ముందు ఏమీ లేదు. నెల అట్టే తిరగొస్తుంది. అద్దె కట్టాలి. పిల్లవాడికి ఫీజుకట్టాలి!" ఇంట్లో సరేసరి గడ్డి అయినా తినాలి. అదీ రేటు పెరిగిపోయింది కదా!" అన్నాడు.

రామ్మూర్తి సైకిలు తొక్కుతూనే "ఏమీ ఫరవాలేదు. అన్నీ సలక్షణంగా జరుగుతాయి. వార్ధక్యం పైబడినవాడిలా అలా మాట్లాడకు. నవయువకుడివి ముసలి మాటలు మాట్లాడితే బావుండదు..." అన్నాడు. రామేశం నవ్వాడు.

ఇంటికి రాగానే ముందుగదిలో చాపమీద విలాసంగా పడుకుని పత్రిక చదువుతున్న సీతమ్మ కనపడింది. భర్తను చూసి "వచ్చారా"? అంటూ లేచి కూర్చుందామె. రామేశం ముందు గది తలుపుమూసి చాపమీద నడుం వాల్చి ఆవలించి భార్యకు దగ్గరగా జరిగాడు. అతని వాలకం చూసి గబాల్న లేవబోతూ "ఏమిటిది? పట్టపగలు....ఛీ...ఛీ..." అంటూ గొణిగింది. ఆ తరువాత గొణగడం మానేసింది. బయట సన్నగా జల్లు మళ్ళీ మొదలైంది.

♦ ♦ ♦ ♦ ♦ ♦

ఆరు గంటలవేళ అతను సంచి సైకిలుకు తగిలించుకుని బయలుదేరాడు. వాతావరణం చల్లగా ఉంది. ఆహ్లాదకరంగా ఉంది. చల్లనిగాలి వీస్తున్నది.

సీతమ్మ అప్పుడే దీపం ముట్టించి కుర్రవాణ్ణి కూర్చోబెట్టి చదివిస్తున్నది. వాడు ముఖం మీద పడుతున్న జుట్టును ఉండి ఉండి పైకి తోసుకుంటూ ఏదో ఇంగ్లీషులో చదువుతున్నాడు.

రామేశం కొడుకును చూసి ముచ్చటపడ్డాడు. సీతమ్మ "మీ దోవన మీరు పోండి...అలా చూస్తారేం? దిష్టి తగిలేను" అన్నది.

"వాణ్ణి కాదే ...నిన్నే చూస్తున్నాను" అంటూ రామేశం నవ్వుతూ సైకిలు తీసుకొని వీధిలోకి వచ్చాడు.

రెండు ఫర్లాంగుల దూరంలో మొదటి పూజ...అదొక స్టీలు సామాన్ల దుకాణం.

రామేశాన్ని పైనుంచే చూసి కౌంటర్‌లో ఉన్న దుకాణం యజమాని బొంగురు గొంతుతో "పొంతులూ! తీరికలేక పూజ సామాన్లు తెప్పించలేదు....ఎళ్ళి తెచ్చుకో..." అన్నాడు.

రామేశం సైకిలు స్టాండు వెయ్యబోతూ ఉంటే పోలీసువాడు విజిల్ ఊది, లాఠి తిప్పుతూ "ఏయ్! తియ్ సైకిలు...రోడ్డుమీద పెడతావేం?" అని గర్జించాడు.

రామేశం అదిరిపడి సైకిలు పక్క స్థలంలోకి తీసుకుపోయి తాళం వేసి దూరంగా ఉన్న పచారీ దుకాణానికి వెళ్ళి కొబ్బరి కాయ, పసుపు, కుంకుమ, ఊదొత్తులు... తీసుకున్నాడు. తరువాత దోవలోనే పూలు తీసుకుని దుకాణానికి వచ్చాడు. నాలుగు రూపాయలు అయింది. వచ్చీ రాగానే లోపల ఎత్తుగా గోడకున్న దేవుడి బొమ్మదగ్గర స్టూలుమీద నిలబడి పూజ చేశాడు. ఆ తరువాత దుకాణం యజమానికి ప్రసాదం అందించి నిలబడ్డాడు. దుకాణం యజమాని గల్లా పెట్టెలోంచి అయిదు రూపాయల నోటు తీసి "ఉంచుకో పొంతులూ... కొరవసవరవ పై వారం చూసుకుందాంలే" అంటూ అందించాడు.

రామేశం మళ్ళీ సైకిలెక్కి బయలుదేరాడు. ఈ రోడ్డు జనంతో కిటకిట లాడుతున్నది. ఏ వాహనాలు రాని కారణంగా కేవలం జనంతో కిక్కిరిసి రోడ్డంతా ఇంటర్వెల్ సమయంలో సినిమాహాలు వరండాలాగుంటుంది. రామేశం సైకిలు స్టాండులో ఉంచి కాలినడకన బయలుదేరి ఒక ఫాన్సీషాపు, ఒక రెడిమేడ్ దుస్తుల షాపు, మరో ఇనుప సామానుల దుకాణం వగైరాలలో పూజలు నిర్వహించాడు. అయితే, ప్రతిచోటా రెండు, మూడు రూపాయలకు తక్కువ ఏమీరాదు. అయితే, ఒక్కొక్కచోట రుసరుసలు...మరోచోట నిర్లక్ష్యంతోకూడిన ప్రవర్తన...ఇది మామూలే.

మళ్ళీ సైకిల్ తొక్కుకుంటూ బయలుదేరాడు...ఈసారి ఒక బ్రాందీ షాపు. వాళ్ళు పూజ ద్రవ్యాలు తెప్పించే ఉంచుతారు. ముందు పెద్ద గది...ఎదురుగా పెద్ద ఫ్రిజ్....చుట్టూ అద్దాల బీరువాల్లో రకరకాల రంగురంగుల సీసాలు...లోపల చిన్న గది....అక్కడ అన్నీ రకరకాల పెట్టెలు. వాటినిండా బీరు, విస్కీ బ్రాందీ వగైరా సీసాలు. ఒకవైపు గోడకు దేవుడి ఫోటో...

రామేశం పూజ ప్రారంభించాడు.

అంతలో ముగ్గురు వ్యక్తులు వచ్చారు. షాపు యాజమని మందు అక్కడ తాగేందుకు వీలులేదన్నాడు. వాళ్ళు వదలలేదు. 'త్వరగా గొంతులో పోసుకుని వెళ్ళిపోతా' మని ప్రాధేయపడ్డారు. షాపులో సీసాలందించే పదేళ్ళ పసివాడివంక చూశాడు రామేశం. వాడు ఆత్రుతగా చూస్తున్నాడు. వాళ్ళను లోపల తాగనిస్తే వాళ్ళు వాడికో పావలా పడేసిపోతారు. నీళ్ళూ, గ్లాసులు అందించినందుకు, సిగరెట్లు వగైరాలు తెచ్చిపెడితే అర్ధ రూపాయికూడా రాలుతుంది.

అదీ వాడి బాధ.

వాళ్ళు పోరగా పోరగా షాపు యజమాని చివరకు ఒప్పుకున్నాడు.

"త్వరగా కానివ్వాలి. పోలీసులతో, ఎక్సయిజు వాళ్ళతో చచ్చే చావుగా వుంది. లేకపోతే ఈ ఘోరమైన టాక్సులతో వ్యాపారం చెయ్యలేము..." అని గొణుగుతూనే కుర్రవాణ్ణి పిలిచి "వాళ్ళకేం కావాలో చూడు" అని పురమాయించాడు.

వాళ్ళు లోపలికి వచ్చారు. రామేశం పూజ చేస్తూనే ఉన్నాడు. వాళ్ళు అక్కడ తాగుతూ కబుర్లు చెప్పుకుంటూ నిలబడ్డారు. ఉన్నట్టుండి వాళ్ళలో ఒకడు... "పంతులు

గారు పూజ చేస్తున్నార్రా..."అన్నాడు. మరొకడు ఇకిలించి... "ఆడి పూజ ఆడిది...మన పూజ మనది...." అన్నాడు.

తర్వాత వాళ్ళేమీ మాట్లాడలేదు. కొద్ది నిముషాల్లో తమ కార్యక్రమం ముగించుకుని వెళ్ళిపోయారు.

రామేశం ఇవతలికి వచ్చి నిలబడ్డాడు. దుకాణం యజమాని తన బేరం చూసుకుని రెండు మూడు నిమిషాల తరువాత అతన్ని గమనించి... "నువ్వింకా నిలబడే ఉన్నావా పంతులూ?" అంటూ అదొక రకంగా నవ్వుతూ గల్లాలోంచి రెండు రూపాయల కాగితం అందించాడు.

రామేశం మౌనంగా దాన్ని అందుకుని ఎదురు దుకాణంలోకి చూశాడు. అదొక మందుల షాపు...ఇటీవలి వరకూ తనదే పూజ అక్కడ...కాని నెల రోజుల కిందట ఎవడో పోటీకొచ్చిపడ్డాడు. తనకు ఉద్వాసన జరిగింది.

ఇక ఒక్కచోట మిగిలి ఉంది మరో ఫర్లాంగుదూరం....ఇపుడు సైకిల్ తొక్కుతుంటే హాయిగా వుంది. పలుచని వెన్నెల...ఆకాశంలో తెల్లని మబ్బులు...చల్లనిగాలి...

ఆ షాపు అతని కార్యక్రమంలో చివరిది...ఆ యజమాని మధ్య వయస్కుడు. దైవభక్తి పరుడు....పాపభీతి, జీవకారుణ్యం కలవాడు...ప్రతి శుక్రవారం తన పూజ పూర్తి అయ్యేంత వరకూ పక్కనే నిలబడి ఉంటాడు. చేతులు జోడించి కళ్ళు మూసుకుని తాను కూడా ప్రార్థన చేస్తూ ఉంటాడు. ఇటీవల అతని కన్నీ బాధలే...వ్యాపారం బాగులేదు. బాకీలు వసూలు కావడం లేదు...ఋణదాతల ఒత్తిడి ఎక్కువైంది...కోర్టు గొడవలు వచ్చిపడ్డాయి. "అలాటి మంచి వ్యక్తికి ఈ బాధలు రాకూడదు" అనిపిస్తుంది రామేశానికి

షాపు మెట్లెక్కుతున్న రామేశానికి దుకాణం అంతా బోసిగా కనిపించింది. తళతళలాడే ఖరీదైన నగలు పెట్టేలుండే గాజు బీరువాలు బోసిపోతూ ఖాళీగా కనిపించాయి.

ఆయన మాత్రం అక్కడే కూర్చుని ఉన్నాడు. రామేశాన్ని చూస్తునే లేచి నవ్వుతూ సిద్ధంగా ఉన్న పూజా ద్రవ్యాలు చూపించాడు.

రామేశం నెమ్మదిగా, భక్తితో పూజ చేశాడు. మనసును ఎటూ పోనీయకుండా నిశ్చల భక్తితో దుకాణం యజమానికి శుభం చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించాడు

అంతా ముగిశాక అతనికి నమస్కరించి ప్రసాదం అందుకుని, కళ్ళకద్దుకుని నోట్లో వేసుకుని "కూర్చోండి" అన్నాడు.

ఆ తరువాత జేబులో నుంచి యాభై రూపాయల నోటుతీసి రామేశానికి అందించి "ఉంచండి" అన్నాడు. తరువాత నెమ్మదిగా మాట్లాడడం ప్రారంభించాడు.

"పంతులుగారు! నాపని అయిపోయింది. ఇక ఇక్కడ ఉండలేము. అంతా ఒక్కసారి విరుచుకు పడ్డట్టయింది. అయినా దేవుడి దయవల్ల నేను మిగిలాను. అన్నింటిలోంచి బయటపడ్డాను... ఏమీ మిగలకపోయినా ఫరవాలేదు... నేనూ, నా పెళ్ళాం, పిల్లలు మిగిలాము...కొట్టుకూడా అమ్మేశాను. కట్టుబట్టలు, కొంచెం రొఖ్ఖం తప్ప ఏమీ లేదు. మా ఊరికి వెళ్ళిపోతున్నాము...రేపే ప్రయాణం...అక్కడో చిన్న మడి చెక్క ఉంది...పాత ఇల్లు ఉంది. అక్కడే కలో గంజి తాగి బతుకుతాము. ఇరవైఏళ్ళకిందట వచ్చానిక్కడికి... ఇప్పుడేమీ లేకుండా వెళ్ళిపోతున్నాను..."

క్రమంగా అతని గొంతులో జీర అధికమైంది. ఉన్నట్టుండి చేతులు జోడించి "వెళ్ళిరండి" అన్నాడు బొంగురు గొంతుకతో. ఆ మాటలని గిరుక్కున వెనుదిరిగి లోపలికి వెళ్ళిపోయాడు.

రామేశం మనసు బరువెక్కింది. విలవిలాడిపోయాడు. కళ్ళు చెమ్మగిల్లాయి. కొన్ని క్షణాలు అలాగే విగ్రహంలా నిలబడి తరువాత మెట్లుదిగి ఇంటివైపు ప్రయాణం సాగించాడు.

అతడింటికి చేరేసరికి కుర్రవాడు హాయిగా నిద్రపోతున్నాడు. సీతమ్మ అంతవరకూ ఆ ప్రక్కనే భర్తకోసం ఎదురుచూస్తూ కూర్చున్నది. చుట్టుప్రక్కల ఎక్కడో ఏదో పురుగులు చేస్తున్న సవ్వడి తప్ప చుట్టూ నిశ్శబ్దం...

సీతమ్మ భర్తను చూసి లేచి... "ఏమీ తినరా?" అని అడిగింది. అతడు తల అడ్డంగా ఊపి... ఊం–తినను....కాసిని మజ్జిగ ఉంటే ఇవ్వు" అన్నాడు చాపమీద పడుకుంటూ.

"అలా ఉన్నారేం?" అంటూ సీతమ్మ మజ్జిగ తెచ్చి ఇచ్చింది. అతను మాట్లాడలేదు. ఆ తరువాత ఆమె వంటగదిలో అన్నీ సర్దుకుని పావుగంటలో ఇవతలికి వచ్చేసరికి రామేశం కదలకుండా పడుకుని నిద్రపోతున్నాడు.

సీతమ్మ భర్త సంచి అందుకుని చూసింది. డబ్బు అంతా ఒకచోట చేర్చి దీపపు వెలుగులో లెక్కపెట్టింది. మామూలు కంటే చాలా ఎక్కువ ఉంది డబ్బు...

ఆమె తనలో తాను నవ్వుకుని ఆ డబ్బు బీరువాలో దాచి ఉంచి తాను కూడా భర్త సరసనే చాప మీద నడుం వాల్చింది... "ఈ నెల ఫరవాలేదు, గడిచిపోతుంది"... అనుకున్నదామె.

అంతలో రామేశం ఏదో కలవరిస్తుంటే తలతిప్పి చూసింది. నిద్రలో అతను ఆబ్దికపు మంత్రాలు చదువుతున్నాడు.

నెమ్మదిగా, మృదువుగా నుదురు స్పృశించి పక్కకు తిరిగి పడుకున్నదామె.

బయట మళ్ళీ మబ్బులు గుమికూడాయి...గర్జించాయి...అంతలో కుండలతో బోర్లించినట్లు వర్షం మొదలైంది.

◆ ◆ ◆